
సాక్షి జనగామ

శనివారం । 2 । మార్చి । 2024



సమ్మక్క సాగర్.. నిండుకుండ

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ నిండు కుండను తలపిస్తున్నది.

- 8లో▸



కొనసాగుతున్న హుండీల లెక్కింపు

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర హుండీల లెక్కింపు కొనసాగుతున్నది. రెండో రోజు శుక్రవారం రూ.2,98,35,000 ఆదాయం లభించింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

37^{0} /22^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికమై ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి పూట చలి తక్కువగా ఉంటుంది.

పరిశీలన.. వివరణ!

'కాళేశ్వరం'పై కాంగ్రెస్ ఆరోపణలకు బీఆర్ఎస్ కౌంటర్

- కేటీఆర్‌తోపాటు పార్టీ ముఖ్యనాయకుల మేడిగడ్డ సందర్శన
- కుంగిన బ్యారేజీ, పగుళ్ల పరిశీలన..
- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు మరమ్మతులు చేయాలి..
- అన్నారం వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కడియం
- మూడు గంటలపాటు బ్యారేజీల వద్దనే నేతలు
- బీఆర్ఎస్ శ్రేణులు-పోలీసులకు మధ్య తోపులాట



మేడిగడ్డ బ్యారేజీ పియర్ పగుళ్లను పరిశీలించి వస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు



అన్నారంలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన హరీశ్‌రావు, పోచారం, కడియం, మల్లారెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్/కాళేశ్వరం:

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు, అవాస్తవాలు ప్రచారం చేస్తోందని, వీటిని తిప్పికొట్టడానికి బీఆర్ఎస్ పార్టీ శుక్రవారం చేపట్టిన చలో మేడిగడ్డ సందర్శన ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలించిన కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు నేతలు.. కాంగ్రెస్ చేసిన ఆరోపణలకు సమాధానాలిచ్చారు. కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ కాదని, మూడు బ్యారేజీల సమాహారమని చెప్పుకొచ్చారు. రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ చేసిన ప్రచారంపై స్పందిస్తూ ఏ ప్రాజెక్టు అయినా ప్రతిపాదిత వ్యయం కంటే అధికం కావడం సాధారణమని, ఇందుకు ఉదాహరణలుగా నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులని వివరించారు. బ్యారేజీకి మరమ్మతులు చేసి రైతులకు నీరందించాలని, దీన్ని వదిలి సీఎం కేసీఆర్ ఎంతో దూరదృష్టితో నిర్మించిన ప్రాజెక్టును కాంగ్రెస్ సర్కారు గాలికి వదిలేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏసీ బస్సుల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలతోపాటు పార్టీ ముఖ్య నేతలు వరంగల్, భూపాలపల్లి మీదుగా సాయంత్రం 4:50 గంటలకు మేడిగడ్డకు చేరుకున్నారు. మొదట బ్యారేజీలోకి వెళ్లారు. 7వ బ్లాక్‌లో కుంగిన 20వ పియర్‌ను, వచ్చిన పగుళ్లను పరిశీలించారు. ఆ తర్వాత అన్నారం బ్యారేజీకి కాన్వాయ్‌లో బయలుదేరారు. అన్నారం బ్యారేజీని పరిశీ లించారు. అక్కడే ఏర్పాటుచేసిన సభకు కేటీఆర్ అధ్యక్షత వహించగా ముఖ్యనాయకులు మాట్లాడారు. అంతకుముందు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బ్యారేజీలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ఇచ్చారు. కాళేశ్వరం ద్వారా ఎన్ని లక్షల ఎకరాలకు నీరందించారు.. ఎంత వ్యయం.. ఎన్ని లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వచ్చిందనేది వివరించారు. దాదాపు 45 నిమిషాల పాటు ప్రజెంటేషన్ కొనసాగింది.

మరమ్మతు చేస్తే రైతులకు పుష్కలంగా నీరు

సభలో నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ముందుగా కడియం శ్రీహరి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి దివాలా కోరు రాజకీయం చేస్తున్నారన్నారు. వర్షాకాలంలోపు మరమ్మతులు చేయకుండా అప్పటి ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ విచారణ పేరుతో కాలయాపన చేస్తూ రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నాడన్నారు. రైతులకు ప్రయోజనాలు చేకూర్చాలి కానీ బ్యారేజీల పేరుతో రాజకీయాలు మానుకోవాలన్నారు. బ్యారేజీలో ఒకటి, రెండు పిల్లర్లు కుంగి పగుళ్లు వస్తే కాళేశ్వరం ప్రాజెక్టుపై బద్నాం చేయడం మంచిది కాదన్నారు. రిటైర్డ్ జేపీసీ ఇంజనీర్ల సంఘం సభ్యుడు వెంకటేశం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుకు తొలి బ్యారేజీ అయిన మేడిగడ్డ ఒక్కటే శరణ్యం అన్నారు. ఇక్కడే నీటిలభ్యత ఉందన్నారు. మరమ్మతులు చేస్తేనే నీటిని వినియోగించవచ్చన్నారు. మేడిగడ్డ ద్వారా ప్రతీ ఏడాది 900 టీఎంసీల నీటిని వాడుకోవచ్చన్నారు. సీడబ్ల్యూసీనే 1600 టీఎంసీల నీటి లభ్యత ఉందని రిపోర్టు ఇచ్చిందన్నారు. ప్రత్యేకమైన కమిటీతో ఎన్‌డీఎస్‌ఏ నిపుణులను నియమించి మరమ్మతులు చేయడానికి పునరాలోచన చేయాలన్నారు. వాటర్ రీసెర్చ్ నిపుణుడు వి.ప్రకాశ్ మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 21న కుంగినా ఇప్పటి వరకు బ్యారేజీ అలాగే ఉందన్నారు. బ్యారేజీలో ఎలాంటి డిజైన్ లోపం లేదని చెప్పుకొచ్చారు. 2022 జూలై 14, 15వ తేదీల్లో వచ్చిన వరదల కారణంగా బ్యారేజీ పైనుంచి నీరు పారిందని, దీంతో పగుళ్లు ఏర్పడ్డాయన్నారు. చివరగా కేటీఆర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రతి బ్యారేజీ, పంపుహౌస్‌లను దశల వారీగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి, పుట్ట మధు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల ఓవరాక్షన్..

బ్యారేజీ సందర్శనకు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో పోలీసులు ఓవరాక్షన్ చేశారు. ఎవరినీ లోపలికి అనుమతించలేదు. మీడియాను కూడా అడ్డుకున్నారు. ఒక అధికారి లోపలికి పంపించు అని అంటే.. మరో అధికారి వద్దు అని మీడియాను అడ్డుకొని ఐడీ కార్డు చూపించాలని తోసేశారు. డీఎస్పీ స్థాయి అధికారి ఒకరు గేటు వద్ద డ్యూటీ చేస్తూ దురుసుగా ప్రవర్తించడంతో మీడియా ప్రతినిధులు వాగ్వాదానికి దిగారు. అడుగడుగునా పోలీసుల ఆంక్షలతో ఆందోళన నెలకొంది.

పర్యటన సాగిందిలా..

- సాయంత్రం 4.50 గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి కేటీఆర్ బృందం చేరుకుంది.
- 5.02 గంటలకు బ్యారేజీ 7వ బ్లాక్‌లోని 20వ పియర్ కుంగిన పగుళ్లను పరిశీలించి వెనుదిరిగారు.
- 5.12 గంటలకు మేడిగడ్డ వద్ద మీడియాతో మాట్లాడారు.
- 5.50 గంటలకు కాన్వాయ్ అన్నారం బ్యారేజీకి చేరుకుంది.
- 6 గంటలకు బ్యారేజీని పరిశీలించారు.
- 6.10 గంటల నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బ్యారేజీలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.
- రాత్రి 7.28 గంటలకు రిటైర్డ్ జేపీసీ ఇంజనీర్ల సంఘం సభ్యుడు వెంకటేశం బ్యారేజీ విశిష్టత వివరించారు.
- 7.40 గంటలకు వాటర్ రీసెర్చ్ నిపుణుడు వి.ప్రకాశ్ మాట్లాడారు.
- 8 గంటలకు బృందం తిరుగుపయనం



బస్సులో కేటీఆర్, పోచారం, హరీశ్

మూడు గంటలపాటు బిజీబిజీ

మూడు గంటల పాటు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల సందర్శనలో బీఆర్ఎస్ నేతలు, పార్టీ శ్రేణులు బిజీబిజీగా గడిపారు. సాయంత్రం 4:50 గంటలకు మేడిగడ్డకు వచ్చిన వీరు రాత్రి 8గంటలకు తిరుగుపయనమయ్యారు.

బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన..

బ్యారేజీ సందర్శనకు వచ్చిన కేటీఆర్‌తో తమను బ్యారేజీ దిగువకు అనుమతించాలని పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు గేటు వద్ద ఆందోళనకు దిగారు. కేటీఆర్ కాన్వాయ్‌కి అడ్డుగా ఉండడంతో పోలీసులు వారిని నిలువరించారు. లోనికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఓ మహిళా కార్యకర్త కింద పడిపోయింది. దీంతో కార్యకర్తలు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు – బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. తర్వాత పోలీసులు వారిని బ్యారేజీ చూడడానికి అనుమతించడంతో గొడవ సద్దుమణిగింది.

న్యూస్‌రీల్

మసీదులో కలెక్టర్ నమాజ్



స్టేషన్‌ఘన్‌పూర్ : స్థానిక తహసీల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా శుక్రవారం డివిజన్ కేంద్రానికి వచ్చారు. మధ్యాహ్నం నమాజ్ సమయం కావడంతో తన వాహనంలో స్థానిక పాత గాంధీ చౌరస్తా సమీపాన ఉన్న మసీదుకు వెళ్లారు. సాధారణ వ్యక్తిగా నమాజ్ చేసిన అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. మసీదుకు వచ్చిన ఆయనను ఎవరూ గుర్తించలేదు. తర్వాత తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటర్ పరీక్షలకు 199 మంది గైర్హాజర్



జనగామ రూరల్: జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్ మీడియట్ పరీక్షలకు 199 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 4,597 మంది విద్యార్థులకు 4,398 మంది పరీక్ష రాసినట్లు డీఐఈఓ బైరి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో డీసీపీ సీతారాం, ఎస్‌హెచ్‌ఓ పరీక్ష కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. డీఐఈఓ బైరి శ్రీనివాస్, డెక్ సభ్యులు దేవరుప్పుల, కొడకండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలను, నర్మెట, పట్టణంలోని ఏబీవీ కళాశాలలను ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు సందర్శించారు.

'ఎంవీ యాక్ట్'ను సవరించాలి



జనగామ రూరల్: రవాణా రంగాన్ని నీరుగార్చే 'ఎంవీ యాక్ట్'ను సవరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొట్ల శ్రీనివాస్, రాపర్తి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కారు, క్రూజర్స్, డ్రైవర్స్ ఓనర్స్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. దేశ అభివృద్ధిలో కీలకంగా ఉన్న రవాణా రంగంలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమాన్ని పాలకులు పట్టించుకోవడంలేదని, కుటుంబాలను పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారిని ఆదుకోవడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించి ప్రమాద బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విజేందర్, యాకయ్య, గోపి, ప్రకాశ్, సునీల్, మహేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- సీఎం కార్యాలయంలో ఫిర్యాదు

రఘునాథపల్లి: రఘునాథపల్లి జీపీలో అక్రమాలు జరిగాయి.. అందులో భాగస్వామిగా ఉన్న జిల్లా పంచాయతీ అధికారిపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామానికి చెందిన ఠాకూర్ గణేష్ సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సచివాలయంలోని సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని, నకిలీ బిల్లులతో ఆస్తి పన్ను, ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్స్ కాజేశారని పేర్కొన్నారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టిన డీపీఓ అవినీతి జరిగినట్లు గుర్తించారని, ఆ మొత్తాన్ని మాజీ సర్పంచ్ నుంచి రికవరీ చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదన్నారు. అక్రమాల్లో భాగస్వాములుగా ఉన్న మాజీ సర్పంచ్, డీపీఓ ఆడిట్ నివేదికలు కూడా మార్చారని పేర్కొన్నారు. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న డీపీఓ.. విదేశాలకు వెళ్లనున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో తెలిపినట్లు గణేష్‌సింగ్ చెప్పారు.

6 నుంచి ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఎల్ఎల్‌బీ మూడేళ్ల మూడో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక శుక్రవారం తెలిపారు. ఈనెల 6, 11, 13, 15, 18 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

5వ సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో మూడేళ్ల లాకోర్సు ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 7 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. ఈనెల 7, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

ఎమ్మెల్యే వర్సెస్ బీఆర్ఎస్





పెట్టుబడి సాయం, ప్రొటోకాల్‌పై నిలదీస్తున్న బీఆర్ఎస్ సభ్యులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

- జెడ్పీ సమావేశంలో లొల్లిలొల్లి
- 'రైతుబంధు'పై డీఏఓపై ప్రశ్నల వర్షం
- ఎమ్మెల్యేను అగౌరవ పరిచేలా వ్యాఖ్యలు

జనగామ: 'రైతుబంధు' పెట్టుబడి సాయంపై జిల్లా సర్వసభ్య సమావేశం దద్దరిల్లిపోయింది. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వర్సెస్ బీఆర్ఎస్ జెడ్పీటీసీల మధ్య మాటల యుద్ధం నడిచింది. శుక్రవారం చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జెడ్పీ సమావేశం జరిగింది. 'రైతుబంధు' పెట్టుబడి సాయం వందశాతం రావడం లేదని పాలకుర్తి, నర్మెట జెడ్పీటీసీలు పి.శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్ అనగా.. గత ప్రభుత్వంలో గుట్టలు, చెట్లకు ఇచ్చి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడారు. ఈ క్రమంలో.. పాలకుర్తి జెడ్పీటీసీ శ్రీనివాస్ అసలు మీకు అవగాహన ఉందా లేదా అంటూ ఎమ్మెల్యేను అవహేళన చేశారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై తిరిగి సమాధానం చెప్పే క్రమంలో బీఆర్ఎస్ జెడ్పీటీసీలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడి అగౌరపరిచారంటూ ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు. శ్రీనివాస్ వ్యాఖ్యలపై రఘునాథపల్లి కాంగ్రెస్ ఎంపీపీ వరలక్ష్మి అభ్యంతరం వ్యక్తం చేయగా.. ఎమ్మెల్యేపై అలా మాట్లాడి ఉండకూడదంటూ స్టేషన్‌ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. అనంతరం మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని పాలకుర్తిలో జరిగే సమీక్షకు వెళ్లాల్సి ఉందని ఎమ్మెల్యే అనగా.. ప్రజాసమస్యలపై చర్చ జరుగుతుంటే ఎలా వెళ్తారంటూ బీఆర్ఎస్‌కు చెందిన పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఉదయం 11.15 గంటలకు జెడ్పీ సమావేశానికి వస్తే.. చైర్‌పర్సన్, చాలా మంది సభ్యులు రాలేదు.. సమయపాలన పాటించకుండా తమను నిందించడం సరికాదని పేర్కొన్న ఎమ్మెల్యే.. మరోసారి ఈ పరిస్థితి రిపీట్ కావొద్దు.. అన్ని శాఖలపై చర్చ జరగాలని అధికారులకు సూచించారు.

ప్రొటోకాల్‌పై రగడ

గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ విస్మరిస్తున్నారని జెడ్పీటీసీ సత్తెమ్మ, పి.శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసంగి సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి క్లారిటీ లేదని నిలదీస్తూ.. జిల్లాలో ఎంతమంది రైతులకు ఇచ్చారో తెలపాలని పట్టుబట్టారు. డీఏఓ వినోద్‌కుమార్ వివరాలు తెలుపగా సభ్యులు సంతృప్తి చెందలేదు. గత ఏడాది మార్చి–ఏప్రిల్ నెలల్లో ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న పంటలకు రూ.33 కోట్లకు పైగా నాటి ప్రభుత్వం విడుదల చేయగా, నేటికీ అన్నదాతల ఖాతాల్లో జమ కాలేదని పలువురు జెడ్పీటీసీలు అనగా.. బడ్జెట్ రిలీజై ట్రెజరీలో ఉందని, ఆదేశాలు వచ్చిన వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తారని డీఏఓ వివరించారు.

త్వరలోనే రైతుబంధుపై క్లారిటీ : ఎమ్మెల్యే

రైతులకు పెట్టుబడి సాయం అందించే విషయంలో ప్రభుత్వం కేబినెట్‌లో చర్చించి త్వరలోనే క్లారిటీ ఇస్తుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. వ్యవసాయం చేసుకునే అర్హులైన రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం ఉంటుందని చెప్పారు. పంట నష్ట పరిహారం విషయంలో విడుదలైన డబ్బుల గురించి వాకబు చేస్తానన్నారు. ఆరు గ్యారంటీ స్కీంలతో పాటు ప్రజల సమస్యలు, అభివృద్ధి విషయంలో సీఎం అంకితభావంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు.

గూండాయిజం పోలేదు..

పాలకుర్తి శ్రీ సోమేశ్వరస్వామి జాతర నేపథ్యంలో ఎమ్మెల్యే సభ మధ్యలోనే వెళ్లిపోతూ జెడ్పీ సీఈఓను బయటకు పిలిపించుకున్నారు. తాను మాట్లాడుతుంటే సభ్యులకు మైక్ ఇవ్వాల్సిన అవసరం ఏముంది.. విధినిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదంటూ అతడిని మందలించారు. ఈ విషయమై కలెక్టర్, అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. అధికారం పోయినా.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల గూండాయిజం పోలేదు.. చూస్తూ ఊరుకోం.. ప్రజలు గమనిస్తున్నారు.. తనను టార్గెట్ చేసినట్టుగా భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

మోదీని మూడోసారి ఆశీర్వదించండి



జనగామ పట్టణంలో బీజేపీ ర్యాలీ



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్
- జిల్లాకు చేరిన బీజేపీ సంకల్పయాత్ర

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి: పదేళ్ల పాలనలో దేశాన్ని ప్రపంచ దేశాలకు దీటుగా తీర్చిదిద్ది ప్రతి భారతీయుడు గర్వపడేలా చేసిన కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని మూడోసారి ఆశీర్వదించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని బీజేపీ తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర శుక్రవారం జనగామకు చేరుకుంది. సిద్దిపేట రోడ్డు గీతాశ్రమం నుంచి ర్యాలీగా పోలీసు కంట్రోల్ రూం వరకు చేరుకుంది. ఘన్‌పూర్ బస్టాండ్ నుంచి శివాజీచౌక్ వరకు రోడ్‌షో అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. అంతకు ముందు శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. అలాగే పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు రోడ్ షో తర్వాత కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభల్లో ఈటల మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా.. రూ.4వేల పెన్షన్, మహిళల ఖాతాల్లో రూ.2,500 రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తున్నదని, అసెంబ్లీలో 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 199 స్థానాల్లో 40 మంది మహిళలకు అవకాశం కల్పిస్తామని, ప్రస్తుతం జరుగబోయే ఎంపీ ఎన్నికల్లో 4 నుంచి 5 సీట్లు ఆడపడుచులకే అన్నారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం కొట్లాడుతున్నా ఏ ఒక్క పార్టీ కూడా పట్టించుకోలేదని, నరేంద్ర మోదీ ఒక్కరే వర్గీకరణ కోసం ముందుకు వచ్చారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మోదీని ఈసారి కూడా అధికారంలోకి తీసుకురావడం మనందరి బాధ్యత అని అన్నారు. ఆయా సమావేశాల్లో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, కేవీఎల్ఎన్.రెడ్డి, సౌడ రమేష్, శివరాజ్‌యాదవ్, పాపారావు, కొంతం శ్రీనివాస్, పవన్‌శర్మ, సంపత్, గుజ్జుల నారాయణ, బొజ్జపల్లి సుభాష్, చిలుక విజయరావు, ఇనుగాల యుగేందర్‌రెడ్డి, ఐలోని అంజిరెడ్డి, ఉడుగుల రమేష్, పద్మారెడ్డి, దొంగరి మహేందర్, దుంపలి సంపత్, మారం రవి, కమ్మగాని శ్రీకాంత్, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రజాపాలన సేవా కేంద్రాలు

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లాలో త్వరలో 'ప్రజాపాలన సేవా కేంద్రాలు' ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్‌తోపాటు ఎంపీడీఓ కార్యాలయాల్లో సేవా కేంద్రాలు అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఆయా కేంద్రాల్లో ఒక అధికారి, ఒక ఆపరేటర్ ఉండాలని ఆదేశించారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఇతర అధికారులతో మాట్లాడారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలు, ప్రజాపాలన దరఖాస్తులపై వివరాలు తెలుసుకున్నారు. ఈనెలలో విద్యార్థులకు పరీక్షలు ఉన్నాయని, పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. విద్యార్థులు నిమిషం ఆలస్యంగా వస్తే కారణం ఉంటే అనుమతించాలని సూచించారు. తనిఖీ చేసిన తరువాతే సెంటర్‌లోకి అనుమతించాలని, మధ్యాహ్నం 12 గంటల వరకు బయటకు రానీయొద్దన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులో కొంత మంది జిరాక్స్ ఇవ్వలేదని, త్వరలో ప్రారంభించనున్న ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సేకరించవచ్చని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇతర అధికారులు

కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డీఆర్డీఓ మొగిలప్ప, డీఐఈఓ శ్రీనివాస్, డీఈఓ రాము, డీపీఓ రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

విద్యార్థులు ప్రణాళికతో చదివితే విజయం సాధ్యమవుతుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహించి ఫలితాలు సరిచూసుకుంటూ.. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలకు సంసిద్ధులను చేయాలని చెప్పారు. డీఈఓ రాము మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని, మంచి నిద్ర, సాత్విక ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ చంద్రబాను, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ఏసీజీఈ రవికుమార్, ఉపాధ్యాయులు నిమ్మ వాసుదేవరెడ్డి, శామ్యూల్, ఆనంద్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం

జనగామ రూరల్: జిల్లాలో పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఎలాంటి సందేహాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని డీఈఓ రాము ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో ముందుంటే రాబోయే పబ్లిక్ పరీక్షలను భయం లేకుండా రాయవచ్చని చెప్పారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి
- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై సమీక్ష



బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 7 నుంచి 11 వరకు జరిగే మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, జాతరకు వచ్చే భక్తులకు బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భక్తుల భద్రతకు సంబంధించి బందోబస్తు, బెల్ట్ షాపుల మూసివేతకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మహాశివరాత్రి జాతర పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ వెంకన్న, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, ఈఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ వెంకటేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిటీ బస్సు కాదు.. రైలే..




పక్క ఫొటోలో కనిపిస్తుంది సిటీ బస్సు అనుకుంటే పొరబడినట్లే. ఇది రైలు. షాలిమార్ – హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం మధ్యాహ్నం మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. వరంగల్ వైపునకు వెళ్లే ప్రయాణికులు వందల సంఖ్యలో ఉండడంతో ఉన్న రెండు జనరల్ బోగీలో కిక్కిరిసిపోయాయి. అయినా ప్రయాణికులు ఫుట్ బోర్డులో నిలబడి సాహసం చేశారు. ఈ దృశ్యాలు ఒకప్పటి సిటీ బస్సు ప్రయాణాన్ని తలపించాయి.

జె. మురళీమోహన్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

సమ్మక్క సాగర్.. నిండుకుండ

- 3.45 టీఎంసీల నీటి నిల్వ
- దేవాదుల వద్ద 1123 క్యూసెక్కుల నీటి పంపింగ్



తుపాకులగూడెం వద్ద నిండుకుండలా కనిపిస్తున్న సమ్మక్క సాగర్ బ్యారేజీ

కన్నాయిగూడెం : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ నిండు కుండను తలపిస్తోంది. వేసవి ప్రారంభం కావడంతో పాటు దేవాదుల ఎత్తిపోతల ఆయకట్టు కింది సాగు చేసిన పంటలకు నీరు అందించాలనే ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు బ్యారేజీలో నీటి నిల్వలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా బ్యారేజీ సామర్థ్యం సుమారు 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.45 టీఎంసీల నీరు అందుబాటులో ఉంచారు. బ్యారేజీలో 59 గేట్లు ఉండగా 57 మూసి రెండు గేట్ల ద్వారా 5,300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిలిపారు. ప్రస్తుత వినియోగాన్ని బట్టి నీటి నిల్వ ఉంచుతున్నట్లు తెలుస్తోంది.

కొనసాగుతున్న దేవాదుల పంపింగ్..

తుపాకులగూడెం జీపీ పరిధిలోని గోదావరి నదిపై నిర్మించిన జె. చొక్కారావు ఎత్తిపోతల పథకం వద్ద పంపింగ్ కొనసాగుతోంది. కొన్ని రోజుల నుంచి మోటార్లు ఆన్ చేసి పంపింగ్ చేస్తున్నారు. కాగా, వివిధ మోటార్ల ద్వారా 1,123 క్యూసెకుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేవాదుల నుంచి గొల్లబుద్దారం, గొల్లబుద్దారం నుంచి భీమ్ ఘన్‌పూర్ తదితర రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేస్తున్నట్లు దేవాదుల డీఈ శరత్ తెలిపారు.

ఆకాశమే హద్దుగా..



ఒకేసారి రెండు, మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మహిళలు
- టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలకు ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు, గ్రామస్తులు

ప్రభుత్వ కొలువు ప్రతీ ఒక్కరి కల. ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడంతోపాటు సమాజంలో గౌరవమర్యాదలతో కూడిన ఉద్యోగం. అందుకే ఈ కొలువు సాధించడానికి లక్షలాది మంది ఉద్యోగార్థులు పోటీ పడుతారు. అయితే నేటి ప్రపంచంలో ఉద్యోగం సాధించాలంటే మహాయజ్ఞం చేయాల్సిందే. నిరంతరం పుస్తకాలతో దోస్తీ కట్టాల్సిందే. రాత్రి, పగలు, చీకటి, వెలుతురు అనే తేడా లేకుండా కాలంతో పోటీ పడుతూ చదవాల్సిందే. అప్పుడే లక్ష్యం నెరవేరుతుంది. ఈ కోవలోనే చదివిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు మహిళలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఒక పక్క కుటుంబ బాధ్యతలు చూసుకుంటూనే మరో పక్క కుటుంబీకుల ప్రోత్సాహంతో అహోరాత్రులు శ్రమించి టీజీటీ, పీజీటీ, జేఎల్, తదితర ఉద్యోగాలు సాధించి తమ లక్ష్యం నెరవేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురి మహిళల విజయగాథపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

-నర్సంపేట

మూడు ఉద్యోగాలు సాధించిన గృహిణి..



శ్రావణి

నెక్కొండ మండల కేంద్రానికి చెందిన గృహిణి శ్రావణి మూడు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించారు. మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించిన శ్రావణి చిన్నప్పటి నుంచే తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూశారు. కష్టపడి చదివి ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యం విధించుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెస్సీ, బీఈడీ విద్యనభ్యసించిన శ్రావణి.. నెక్కొండకు చెందిన అడ్వకేట్ సాంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డిని వివాహం చేసుకున్నారు. కుమారులు విహాన్‌రెడ్డి, విశ్వక్సేన్‌రెడ్డి ఆలనాపాలన చూసుకుంటూనే భర్త ప్రోత్సాహంతో ఐదేళ్ల నుంచి భీమదేవరపల్లిలోని కస్తూర్బాలో కెమిస్ట్రీ కాంట్రాక్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన ఫలితాల్లో డిగ్రీ, జూనియర్, పీజీటీ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కాగా, ఫిబ్రవరి 14న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పోస్టు గ్రాడ్యుయేట్ లెక్చరర్ నియామక పత్రం అందుకున్నారు. అలాగే, ఫిబ్రవరి 22న డిగ్రీ లెక్చరర్ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కాగా, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగంలో చేరుతానని శ్రావణి 'సాక్షి'కి వివరించారు.

భర్త ప్రోత్సాహంతో..



పది సంవత్సరాల లోపు ఇద్దరు పిల్లలను చూసుకుంటూ నా భర్త అశోక్ ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించా. గురుకుల జూనియర్ కళాశాల నియామక ఫలితాల్లో జూనియర్ లెక్చరర్(బోటనీ), పీజీటీ ఉద్యోగాలు పొందిన. వ్యవసాయ పనులు చేస్తూనే నా భర్త ప్రోత్సాహంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించా. చాలా సంతోషంగా ఉంది.

సలుగు శైలజ, అలంకానిపేట, నెక్కొండ మండలం

ఆటంకం ఎదురైనా అధిగమించా



కష్టపడి అనుకున్న ఉద్యోగం సాధించా. మా తల్లి గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. అయినా కుటుంబీకుల సహకారంతో ముందుకెళ్తూ కష్టపడి ఉద్యోగం సాధించా. ఇటీవల విడుదలైన పీజీటీ, జేఎల్, టీజీటీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించా. ఈ మూడు ఉద్యోగాల్లో జేఎల్‌లో చేరుతా. ఎలాంటి శిక్షణ లేకుండా పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యా.

నిహారిక, నారక్కపేట గ్రామం, నల్లబెల్లి మండలం

పట్టుదలతో చదివి.. ఫలితం సాధించి



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు ఎస్‌కే షాజనా. ఈమెది ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామం. నిరుపేద కుటుంబం. ప్రేమ వివాహం చేసుకుంది. ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని లక్ష్యం విధించుకుంది. దీంతో ఈమె పట్టుదలకు తన భర్త షరీఫ్ ప్రోత్సాహం అందించేవారు. సంవత్సరం నుంచి అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తోంది. ఆయాగా పని చేస్తూనే రోజూ సాయంత్రం ప్రిపరేషన్ కొనసాగించేది. అకడమిక్ బుక్స్ కొనుగోలు చేసి ఇంటి వద్దే ప్రిపేర్ అయ్యింది. ఈ క్రమంలో ఇటీవల వెలువడిన పీజీటీ, టీజీటీ **ఉద్యోగాలకు ఎంపికై తన కల** సాకారం చేసుకుంది. పీజీటీ సెలెక్ట్ చేసుకుని తెలుగు సబ్జెక్టును ఎంచుకుంది. ఇటీవలే హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకుంది. పేద విద్యార్థులను చదువులో ఉన్నతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపింది.

అమ్మనాన్న కష్టపడి చదివించారు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బూరుగు సుమలత. ఈమెది వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం శనిగరం గ్రామం. సుమలతను చిన్నప్పటి నుంచి ఆమె తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. పెళ్లి అనంతరం భర్త రాజు ప్రోత్సహించాడు. సుమలతకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ప్రిపరేషన్ కోసం తన పిల్లలను తల్లిదండ్రుల దగ్గర ఉంచి ఏడాదిపాటు చదువుకుంది. పిల్లలను విడిచిపెట్టి చదవుకోవడం ఏమిటని ఎంత మంది మాట్లాడిన రాజు, సుమలత తల్లిదండ్రులు పట్టించుకోలేదు. నిరంతరం ప్రోత్సహించారు. ఫలితంగా ఇటీవల విడుదలైన ఫలితాల్లో పీజీటీలో స్టేట్ 33వ ర్యాంకు, జేఎల్ స్టేట్ 36వ ర్యాంకు సాధించింది.

కొనసాగుతున్న హుండీల లెక్కింపు

- రెండో రోజు ఆదాయం రూ. 2.98 కోట్లు



లెక్కింపు నిర్వహిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది, సేవాసమితి సభ్యులు

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ లష్కర్ బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర హుండీ లెక్కింపు కొనసాగుతుంది. లెక్కింపులో భాగంగా రెండో రోజు శుక్రవారం రూ. 2,98,35,000 ఆదాయం లభించింది. 71 ఐరన్ హుండీల్లోని కరెన్సీ, చిల్లర నాణెలు, వెండి, బంగారం వేరుచేస్తూ లెక్కింపు జరిపామని మేడారం ఈఓ రాజేంద్రం తెలిపారు. మొదటిరోజు రూ. 3,15,40,000 ఆదాయం రాగా, రెండో రోజు రూ. 2,98,35,000 ఆదాయం లభించిందన్నారు. రెండు రోజులు కలిపి మొత్తం రూ. 6,13,75,000 ఆదాయం లభించిందని తెలిపారు. ఈ నగదును బ్యాంకులో జమ చేశామని ఆయన వివరించారు.

పుష్‌పుల్ టికెట్ ధర తగ్గింపు

కాజీపేట రూరల్ : కాజీపేట, సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే పుష్‌పుల్ రైళ్ల టికెట్ ధర తగ్గించినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. కొవిడ్–19 తర్వాత రైల్వేశాఖ కాజీపేట, సికింద్రాబాద్ మధ్య అప్ అండ్ డౌన్ రూట్‌లో ప్రయాణించే పుష్‌పుల్‌కు ఎక్స్‌ప్రెస్ టికెట్ ధర రూ.60 చార్జీతో నడిపిస్తున్నారు. అయితే దక్షిణ మధ్య రైల్వే.. ప్రయాణికుల సౌకర్యార్థం పెంచిన పుష్‌పుల్ టికెట్ ధరను రూ.30 తగ్గించి ఫిబ్రవరి 29వ తేదీ నుంచి అమలు చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్, విజయవాడ రూట్ రైళ్లకు కూడా తగ్గించాలి..

వరంగల్–సికింద్రాబాద్, కాజీపేట–విజయవాడ మధ్య ప్రయాణించే పుష్‌పుల్ రైళ్ల టికెట్ ధరలు కూడా తగ్గిస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు. అందుకు జిల్లా ఎంపీలు, మంత్రులు దక్షిణ మధ్య రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లి మాట్లాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విస్తీర్ణం పెంచి.. పాస్ పుస్తకాల జారీ

- ఒకే సర్వే నంబర్‌లో 97 ఎకరాల పెంపు



రోడ్డుకు ఇరువైపులా ఉన్న కళ్లెం ఏనెలు

లింగాలఘణపురం: మండలంలోని కళ్లెం గ్రామంలో ఒకే సర్వే నంబర్‌లో భూమి విస్తీర్ణం 97.088 ఎకరాలకు పెంచి పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేశారు. అక్రమంగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందిన వారంతా రైతుబంధు లబ్ధి పొందుతున్నారు. 2016–17 ఎల్ఆర్‌యూపీ సమయంలో అప్పటి వీఆర్‌ఓ కళ్లెంలో ఇష్టారాజ్యంగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ చేశారు. కళ్లెం ఏనెల ప్రాంతం రోడ్డుకు ఇరువైపులా సర్వే నంబర్ 36 ఉంటుంది. ఈ సర్వే నంబర్‌లో కాస్రా రికార్డు ప్రకారం 182.27 ఎకరాల భూమి మాత్రమే ఉండగా.. 280.15 ఎకరాలకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ అయ్యాయి. ఇందులో డీటీసీపీ లేవుట్ కూడా ఉందని సమాచారం. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసినా ఏమీ చేయలేకపోతున్నారు. ఇప్పటికే రోడ్లు, వెంచర్లు, ఇళ్ల స్థలాలకు కూడా అక్కడక్కడ 'రైతుబంధు' వస్తోంది. ఈ విషయంపై తహసీల్దార్ వినయలతను వివరణ కోరగా ఒకసారి పట్టాదార్ పాస్‌పుస్తకం జారీ అయితే తొలగించే అధికారం తమకు లేదని, గతంలో ఎలా జరిగిందనే విషయం తెలుసుకుంటానని చెప్పారు.

వంద రోజుల్లో 'గ్యారంటీలు' అమలు చేయాల్సిందే

- దేశంలో రామరాజ్యం.. ఇక్కడ రాక్షస రాజ్యం
- బీఆర్‌ఎస్‌ది రూ.5 లక్షల కోట్లు.. కాంగ్రెస్ ప్రభుత్వానిది ఇప్పటికే రూ.10 వేల కోట్ల అప్పు
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్
- కమలాపూర్‌లో కొనసాగిన ప్రజాహిత యాత్ర



మాట్లాడుతున్న బండి సంజయ్

కమలాపూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేయాల్సిందేనని, లేదంటే వంద రోజుల తర్వాత ఆ గ్యారంటీలు ఎలా అమలు చేయించుకోవాలో ప్రజలకు తెలుసని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర శుక్రవారం సాయంత్రం కమలాపూర్‌లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ వస్తుందని అందరికి తెలుసని, కోడ్ రాకముందే ఆరు గ్యారంటీలు అమలు చేయాలన్నారు. బీజేపీ నేతలు.. ఆరు గ్యారంటీలు, ప్రజల గురించి మాట్లాడకుండా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటయ్యాయన్నారు. ఒకరు మేడిగడ్డ, కాళేశ్వరం అంటున్నారని, మరొకరు పాలమూరు–రంగారెడ్డి అంటూ తిట్టుకుంటున్నారని విమర్శించారు. కాళేశ్వరంలో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగితే మాజీ సీఎం కేసీఆర్‌పై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వాళ్లది ఆ ఆరాటమైతే.. మా పోరాటం ఆరు గ్యారెంటీల అమలుపైనే అన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణలో రూ.5 లక్షల కోట్ల అప్పులైతే.. రెండు నెలల కాంగ్రెస్ పాలనలో ఇప్పటికే రూ.10 వేల కోట్ల అప్పులయ్యాయని ఆరోపించారు. దేశంలో రామరాజ్యం నడుస్తుంటే తెలంగాణలో పదేళ్లు రాక్షస రాజ్యం నడిచిందని, ఇప్పుడు కూడా నడుస్తోందని ఆరోపించారు. తనపై వంద కేసులు నమోదయ్యాయని, దేశంలో ఏ ఎంపీపై వంద కేసులు నమోదు కాలేదన్నారు. తనను 14 సార్లు జైలుకు పంపారని, జైలు తనకు అత్తగారిల్లు అయిందన్నారు. ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం కొట్లాడే పార్టీ కావాలా? లేక ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ టైం పాస్ రాజకీయాలు చేసే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మించి ఐదు శతాబ్దాల కల నెరవేర్చిన నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిని చేద్దామన్నారు. అనంతరం ప్రజాహిత యాత్ర కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశించింది. కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ, స్థానిక బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి.

హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్..

- 40 మంది విద్యార్థినులకు అస్వస్థత
- ఘటన ఆలస్యంగా వెలుగులోకి..
- గోప్యంగా ఉంచి చికిత్స అందిస్తున్న వైనం
- ప్రిన్సిపాల్, నిర్వాహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం



అస్వస్థతకు గురైన విద్యార్థినులు



అస్వస్థతకు గురైన విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కేసముద్రం: ఓ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కారణంగా సుమారు 40 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమీనాపురంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. హాస్టల్‌లో మూడురోజుల క్రితం ఆహారం తిన్న విద్యార్థినుల్లో సుమారు 40 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో పాటు నిర్వాహకులు గోప్యంగా ఉంచి హాస్టల్‌లోనే చికిత్స అందిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఓ విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురి కాగా తండ్రి ఓ ప్రైవేటు ఆసుపత్రి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ శుక్రవారం హాస్టల్‌ను సందర్శించారు. ప్రస్తుతం అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించడం లేదని, భోజనం అనంతరం అనారోగ్యాల బారిన పడుతున్నామని విద్యార్థినులు వివరించారు. దీంతో ఎమ్మెల్యే.. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. అంతకుముందు మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించారు. హాస్టల్ చుట్టూ ఉన్న భూమి కబ్జాకు గురికాండా హద్దులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామెదర్, ఎంపీడీఓ వివేక్‌రాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, నాయకులు గుగులోత్ దస్రూ నాయక్, బండారు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోయాం

- షాపు ఎదుట బాధిత రైతుల ఆందోళన



షాపు ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

మరిపెడ/మరిపెడ రూరల్: నకిలీ వరి విత్తనాలతో తాము మోసపోయామని మండల కేంద్రంలోని సూర్యతేజ ఏజన్సీస్ ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపు ఎదుట మండలంలోని బాల్నిధర్మారం, చిల్లంచర్ల, ఆనెపురం తదితర గ్రామాలకు చెందిన బాధిత రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి సాగు నిమిత్తం సూర్యతేజ షాపులో మహేంద్ర అగ్రి కంపెనీకి చెందిన ఎంపీఆర్–606 అనే రకం వరి వంగడాలను ఎకరాకు 10 కిలోల బ్యాగ్‌ను రూ.1050కి కొనుగోలు చేశామన్నారు. సాగు చేసిన అనంతరం పొలం ఎదుగుదల పూర్తిగా క్షీణించడంతో పాటు పంట పాలు పోసుకుంటుందన్నారు. దీంతో అనుమానం వచ్చి వ్యవసాయ అధికారులతో పంట పరిశీలన చేయించామన్నారు. సగానికి పైగా దిగుబడి తగ్గే అవకాశం ఉందని వారు వెల్లడించారని బాధిత రైతులు వాపోయారు. కొనుగోలు సమయంలో ఎకరాకు 45 బస్తాల దిగుబడి వస్తుందని మాయమాటలు చెప్పి నకిలీ విత్తనాలు అంటగట్టారని, ఇప్పుడు 20 బస్తాలు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఒక్కో రైతు 3,4 ఎకరాలు సాగు చేశారని, ఇందుకు వేలాది రూపాయలు ఖర్చు అయిందన్నారు. దీనిపై షాపు నిర్వాహకులను నిలదీసే ప్రయత్నం చేయగా షట్టర్ వేశారని, దీనిపై స్పందించి యాజమానిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పందించిన షాపు యాజమాని, వ్యవసాయ అధికారి వీరసింగ్.. ఎంపీఆర్ కంపెనీ–606 కంపెనీ నిర్వాహకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలను సంప్రదించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, వీరస్వామి, సతీష్, లింగన్న, వీరన్న పాల్గొన్నారు.

ఆర్థిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

విద్యారణ్యపురి : పాఠశాల స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై పాఠ్యాంశాలు రూపొందించి నేర్పించడం ద్వారా భవిష్యత్ తరాలు ఆర్థిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా వినియోగించుకుంటారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఫిన్ టెక్ ది ఇంక్లూజివ్ స్ట్రాటజీ ఫర్ ఫైనాన్సియల్ ఇంక్లూజన్' అనే అంశంపై నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సును ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల(సీడీఎఫ్) నుంచి రూ. 10 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధులతో స్టూడెంట్ డెస్క్‌లను (బెంచీలు) అందజేస్తామని హామీ ఇచ్చారు. పీసీసీ కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను కేడీసీ పూర్వ విద్యార్థిగా కళాశాల అభివృద్ధికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ కె రాజేందర్.. ఆర్థిక అక్షరాస్యత ఆచరణలు ,డిజిటల్ ఫైనాన్స్, ఆర్థిక సాంకేతిక పరిజ్ఞానంలో ఎదరువుతున్న సవాళ్ల గురించి వివరించారు. కార్యక్రమంలో సదస్సు అధ్యక్షుడు, ప్రిన్సిపాల్ రాజారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సురభి వినోద్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మల్లయ్య, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ బి రమేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలుత జాతీయ సదస్సు సావనీర్‌ను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఇతర అతిథులు ఆవిష్కరించారు.

గ్రంథాలు భవిష్యత్ తరాలకు పునాది

- జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ బాబురావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాబురావు

హన్మకొండ కల్చరల్ : పరిశోధక విద్యార్థులు విభిన్న, వైవిధ్య అంశాలను ఎంచుకుని కష్టపడి సేకరించిన పరిశోధన గ్రంథాలు భవిష్యత్ తరాలకు పునాది అని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్యా బాబురావు అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవం సందర్భంగా వరంగల్ జానపద గిరిజన విజ్ఞానపీఠంలో పీహెచ్‌డీ విద్యార్థులు డాక్టర్ కత్తిమల్లయ్య, డాక్టర్ గంపా సతీష్, ఎంఫిల్ విద్యార్థిని కుంజా వరలక్ష్మి.. గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్, పట్టా అందుకున్నారు. అలాగే, పీహెచ్‌డీ విద్యార్థి వైజయంతుల శ్రీరాములు, ఎంఫిల్ విద్యార్థులు బానోతు కవిత, సీ మహేశ్, ఈసం గౌరయ్య పట్టాలు అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ హంటర్‌రోడ్‌లోని పీఠంలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ బాబురావు పరిశోధక విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, డాక్టర్ బాసని సురేష్, పీఠం సిబ్బంది, పూర్వవిద్యార్థులు, రాజు, నరసింహ, పాషా, సిద్దిపేట నుంచి వచ్చిన నక్కల తెగ ప్రముఖులు పాల్గొన్నారు.